# ఎడతెరిపి లేని ముసురు

- రెండు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షం
- వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు మేలు



జిల్లా కేంద్రంలో కురుస్తున్న ముసురు వర్షం

నాగర్‌కర్నూల్, జూలై 19 (నమస్తే తెలంగాణ)/కందనూలు : జిల్లాలో రెండు రోజులుగా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఈ ముసురు వర్షాలు రైతులకు ఊరటను కల్పించాయి. వరి తోపాటు పత్తి, మొక్క జొన్న పంటలకు ఈ వానలు ఊపిరినిచ్చాయి. జిల్లాలోని 20మండలాల్లో ముసురు ప్రభావం కనిపిస్తోంది. జిల్లాలో 12.1మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే కల్వకుర్తిలో అత్యధికంగా 20.2మిల్లీ మీటర్లు కాగా, అత్యల్పంగా నాగర్‌కర్నూల్‌లో 7.2మి.మీ వర్షం కురిసింది. ఇక మంగళవారం కేవలం 4.4మి.మీటర్లు కాగా, సోమవారం 0.07 మి.మీటర్లే వర్షం నమోదైంది.

***జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా..***

కల్వకుర్తి 22.2 మిల్లీ మీటర్లు, పెద్దకొత్తపల్లిలో 16.6, తిమ్మాజి పేటలో 15.2, వంగూర్‌లో 15, తెల్కపల్లిలో 14.8, అచ్చం పేటలో 14.8, బల్మూర్‌లో 12.6, ఊర్కొండలో 12.2, కోడేరులో 12.2, లింగాలలో 12.2, తాడూర్‌లో 10.4, బిజినేపల్లిలో 10.2, కొల్లాపూర్‌లో 10.2, అమ్రాబాద్‌లో 9.4, వెల్దండలో 8.8, ఉప్పునుంతలలో 08.2, చారకొండలో 8, పదరలో 7.8, నాగర్‌కర్నూల్‌లో 7.2 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైంది.

## విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత



నగదు పురస్కారం అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు, కళాశాల అధ్యాపకులు

కల్వకుర్తి, జూలై 19 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థినితో పాటు, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల నగదు పురస్కారం అందజేశారు. విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు పురస్కారాలను అందజేస్తున్నట్లు మిత్ర ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

## బారికేడ్లు ఏర్పాటు చేయాలి

కల్వకుర్తి రూరల్, జూలై 19 : మండలంలోని మార్చాల గేట్ జడ్చర్ల-కోదాడ ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరు తున్నారు. ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వాహనాల వేగ నియంత్రణ కోసం బారికేడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఊర్కొండ, జూలై 19 : మండలంలోని ఊర్కొండపేటకు చెందిన కప్పెర చంద్రమ్మ అనా రోగ్యంతో మృతిచెందింది. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్ ఎంజేఆర్ ట్రస్టు సభ్యులకు తెలుపగా, బాధిత కుటుంబానికి బుధవారం రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎండీ అక్బర్, శ్రీశైలం, చంద్రయ్య, ఎండీ యూసుఫ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి కుట్రలు తిప్పికొట్టాలి

చారకొండ, జూలై 19 : రైతులపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కుట్రలను తిప్పికొట్టాలని సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురువయ్య గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగానికి మూడు గంటలు కరెంట్ సరిపోతుందని వ్యాఖ్యానించిన రేవంత్‌రెడ్డికి తగినబుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రైతులు కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్నదాతలు గతంలో పడిన కష్టాలు పడొద్దని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అండగా నిలుస్తున్నారన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్, పెట్టుబడి సాయం, రైతుబీమా తదితర పథకాలను అమలు చేస్తుండగా, రైతుల అభివృద్ధిని ఓర్వలేని రేవంత్‌రెడ్డి ఇష్టానుసారం మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు, ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్, ఆర్డీవోల బదిలీ

నాగర్‌కర్నూల్, జూలై 19 : జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోతీలాల్, నాగర్‌కర్నూల్ ఆర్డీవో నాగలక్ష్మి, కొల్లాపూర్ ఆర్డీవో హనుమానాయక్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి నవీన్‌మిట్టల్ ప్రకటించారు. మోతీలాల్ స్థానంలో నాగర్‌కర్నూల్‌కు హైదరాబాద్ నుంచి ముసిని వెంకటేశ్వర్లు బదిలీపై రానుండగా, ఆర్డీవో నాగలక్ష్మి మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి బదిలీ కాగా, గద్వాల ఆర్డీవో రాములు నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. అదేవిధంగా హనుమాన్‌నాయక్ స్థానంలో కొల్లాపూర్‌కు ఆర్డీవోగా నాగరాజు బదిలీపై వస్తున్నారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి, జూలై 19 : మండలంలోని పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ విద్యార్థులకు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విద్యారాణి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. పొలిటికల్ సైన్స్-1, కంప్యూటర్ సైన్స్-1, సంస్కృతం-1, బీఏ(ఎల్) తెలుగు-1, తెలుగు-1 పోస్టులకు గాను అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21న సాయంత్రం 4గంటల్లోపు పూర్తి బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీజీలో 50శాతం పర్సెంటేజీతోపాటు పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధనా అనుభవం కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీని ఫోన్ ద్వారా తెలియజేస్తామన్నారు.

## డీఎస్పీకి సన్మానం



డీఎస్పీ శంకరయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న ఆనంద్‌గౌడ్

కల్వకుర్తి, జూలై 19 : కల్వకుర్తి డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శంకరయ్య గౌడ్‌ను బుధవారం బీఆర్ ఎస్వీ జిల్లా నాయకుడు ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సైదులు గౌడ్, రవి గౌడ్ నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నేడు ధర్నా

తిమ్మాజిపేట, జూలై 19 : ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి బీజేపీ మాట మార్చిందని, వెంటనే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టాలన్నారు.

## నూతన డీఎంగా దేవరాజు

కందనూలు, జూలై 19 : ఆర్టీసీ నూతన డీఎంగా దేవరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎంగా ఉన్న ధరంసింగ్ హన్మకొండ జిల్లాకు బదిలీ కావడంతో విజయవాడ బస్‌స్టేషన్ నుంచి ప్రమోషన్ ద్వారా నాగర్‌కర్నూల్ డిపోకు వచ్చారు.

## బాధితులను పరామర్శించిన గువ్వల



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనును పరామర్శిస్తున్న విప్ గువ్వల బాలరాజు

వంగూరు, జూలై 19 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన జూకటి శ్రీను, పక్షవాతంతో బాధ పడుతున్న తిరుమలయ్యలను ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు హమీద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గణేశ్‌రావ్, ఎంపీడీవో విజయ భాస్కర్, ఎంఈవో శంకర్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెల్దండ, జూలై 19 : ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో దోమల బెడద అధికమై రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు మురుగు నిల్వ లేకుండా కాల్వలు శుభ్రం చేయించాలన్నారు. చెత్తా చెదారం రోడ్లపై వేయరాదని, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీవో ఈశ్వర్‌జీ, ఎంపీవో సునీత, ఈసీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం

వెల్దండ, జూలై 19 : దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదలకు సరిపడా బియ్యం అందజేయాలని ప్రభుత్వం కృషి చేస్తుండగా, క్షేత్రస్థాయిలో సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యంతో బియ్యం గోల్‌మాల్ అవుతున్నాయి. వెల్దండ మండలం కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాలకు సరిపడా బియ్యం చేరకపోవడమే ఇందుకు నిదర్శనం. వివరాలోకెళ్తే.. కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు బుధవారం సివిల్ సప్లయ్ అధికారులు స్టేజీ-2 ద్వారా బియ్యం సరఫరా చేశారు. బియ్యం లోడ్ చేయడానికి హమాలీలకు ఆర్డర్ వేసి పంపించి చేతులు దులుపుకున్నారు. బియ్యం లోడ్ అయ్యిందా.. ఎన్ని సంచుల బియ్యం వేశారు, రేషన్ దుకాణాలకు చేరాయా లేదా అనేది పట్టించుకోలేదు. తీరా కొట్ర రేషన్ షాపునకు వచ్చిన లారీలో మూడు బస్తాల బియ్యం తక్కువగా వచ్చాయి. ఇదేమిటని సదరు డీలరు గోదాం ఇన్‌చార్జి రాఘవేందర్‌రెడ్డిని అడుగగా, తనకేమీ తెలియదని, డ్రైవర్‌ను అడగాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. లారీడ్రైవర్‌ను డీలరు అడుగగా, బియ్యం లోడింగ్ అయ్యాక తీసుకొచ్చానని, తనకేమీ తెలియదని తెలిపాడు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా డీలర్లకు, నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని రేషన్ డీలర్లు అంటున్నారు.

## నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న సీహెచ్‌వో సుధాకర్

వంగూరు, జూలై 19 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ విధిగా హాజరుకావాలని సీహెచ్‌వో సుధాకర్ పిలుపునిచ్చారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. ఏడాది నుంచి 19ఏండ్లలోపు వారికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో ఆయుష్ వైద్యాధికారి శ్రుతి, సూపర్‌వైజర్లు ప్రమోద్, పద్మ, రోజమ్మ, హెల్త్ అసిస్టెంట్ మేషక్ పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్లకు వర్క్‌షాప్

కల్వకుర్తి రూరల్, జూలై 19 : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కెనాన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెనాన్ మోంటర్ రాంబాబు మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేసేందుకు వర్క్‌షాప్‌లు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లాధ్యక్షుడు నేతాజీగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌గౌడ్, కోశాధికారి వంశీ, ఉపాధ్యక్షుడు రియాజ్, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట అధ్యక్షులు రాఘవేందర్, నారాయణగౌడ్, శ్రీనివాసులు, ఫొటోగ్రాఫర్లు ఉన్నారు.